పశువైద్య సేవలు భేష్

- అందుబాటులో వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవ వాహనాలు
- సబ్సిడీతో ఒక్కొక్కరికి 1,800 కిలోల మిశ్రమ దాణా పంపిణీ
- పేద పాడి రైతులకు ఎంతో మేలు


దాకమర్రిలో ఆవులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్న వైద్యసిబ్బంది


హెల్ప్‌లైన్ ద్వారా వైద్య సేవలు అందిస్తున్న సంచార పశు ఆరోగ్య సేవ వాహనం

తగరపువలస: గ్రామీణ ప్రాంతాల్లో అధిక ఉత్పాదక శక్తి కలిగిన పేద రైతుల పశువులకు కళ్లాలు వద్దే నాణ్యమైన పశువైద్య సేవలు అందించేలా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. జాతీయ వ్యవసాయ కమిషన్ – 1976 సిఫారసుల మేరకు ప్రతి 5వేల పశువుల యూనిట్‌కు ఒక వైద్యుడు ఉండాలన్న సూచనను పక్కాగా అమలు చేస్తోంది. ప్రస్తుతం భీమిలి నియోజకవర్గంలో 11 పశువైద్యశాలలు, 51 రైతుభరోసా కేంద్రాలు, రెండు డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవ వాహనాలు అందుబాటులో ఉన్నాయి. వీటి ద్వారా మొత్తంగా 3.5 లక్షల గేదెలు, ఆవులు, గొర్రెలు, మేకలు, పందులు, కుక్కలు, కోళ్లకు నిత్యం వైద్యసేవలు అందిస్తున్నారు. ఇందులో భాగంగా మార్చి 1 నుంచి 31 వరకు పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేసే కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించింది. అలాగే వైఎస్సార్ పశువ్యాధి సంరక్షణ కేంద్రాల్లోని ల్యాబ్‌లలో పేడ పరీక్షలు నిర్వహించి ఏడాదిలో నాలుగు సార్లు మేకలు, గొర్రెలకు నట్టల నివారణ వ్యాక్సిన్లు వేస్తున్నారు. ప్రతి డిసెంబరులో పారుడు వ్యాధి నివారణకు టీకాలు వేస్తున్నారు. ఇటీవల దేశవ్యాప్తంగా విజృంభించిన లంపీ స్కిన్ వ్యాధి నివారణకు సకాలంలో ప్రభుత్వం స్పందించడంతో ఉత్తరాంధ్రలో దాదాపు ఈ వ్యాధి అదుపులో ఉంది. అధిక పాల దిగుబడి కోసం ఒక్కో రైతుకు 1800 కిలోల వంతున సంపూర్ణ మిశ్రమ దాణా కిలోకు రూ.10 సబ్సిడీ పోను రూ.6.50కే అందిస్తున్నారు. పశు కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా ఎలాంటి హామీ లేకుండా రైతులకు 7 శాతం వడ్డీతో రూ.24 వేల నుంచి రూ.1.60 లక్షల వరకు రుణాలు అందిస్తున్నారు. ఇంకా చేయూత, ఆసరా పథకాల ద్వారా పాడి, కోళ్ల పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం సహాయ సహకారాలు అందిస్తోంది.

ఆర్బీకేలు, సంచార వాహనాలతో...

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత పాడి రైతుల ముంగిటకే వైద్య సేవలు అందించేందుకు నియోజకవర్గంలో 51 రైతు భరోసా కేంద్రాలు(ఆర్‌బీకే), భీమిలి, ఆనందపురంలో రెండు డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవ వాహనాలను అందుబాటులో ఉంచింది. ఆర్బీకే, పశు వైద్యశాలలతో పాటు కాల్ హెల్ప్‌లైన్ ద్వారా 1962కు ఫోన్ చేస్తే మారుమూల ప్రాంతాలకు అత్యవసర సేవలు అందించడానికి వైద్యబృందం క్షణాల్లో చేరిపోతున్నారు. 75 శాతం సబ్సిడీతో సంపూర్ణ మిశ్రమ దాణా, పశుగ్రాస విత్తనాలు, గడ్డి కత్తిరించే యంత్రాలు అందుబాటులో ఉన్నాయి. పారుడు వ్యాధి నివారణ టీకాలు 90 శాతం పశువులకు ఇప్పటికే పూర్తికాగా వలసపోయిన వారు తిరిగి వస్తే వారి పశువులకు కూడా వీటిని పూర్తిగా వేయనున్నారు.

గత ప్రభుత్వాలతో పోలిస్తే మెరుగైన సేవలు



గత ప్రభుత్వాలతో పోలిస్తే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతులతో సమానంగా పాడి రైతులకు కూడా అధిక ప్రాధాన్యమిస్తూ అన్నిరకాల సేవలు అందుబాటులో ఉంచింది. మేలైన పాల సేకరణ ధరలు కూడా అందించి ప్రోత్సహిస్తున్నారు.

– సంకురుభుక్త సూర్యనారాయణ, పాడిరైతు, దాకమర్రి, భీమిలి మండలం

ప్రత్యేక బోధనతో శత శాతం ఉత్తీర్ణత


ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న మాణిక్యంనాయుడు

భీమునిపట్నం: పదో తరగతి విద్యార్థుల చదువు విషయంలో ఉపాధ్యాయులు తగిన శ్రద్ధ తీసుకోవాలని జిల్లా విద్యా శిక్షణ సంస్థ (డైట్) ప్రిన్సిపాల్ యు.మాణిక్యంనాయుడు అన్నారు. స్థానిక పండిట్ నెహ్రూ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పదో తరగతిలో సరిగ్గా చదవని విద్యార్థులను గుర్తించి వారికి అర్థమయ్యేలా ప్రత్యేక పద్ధతిలో బోధించాలని సూచించారు. తద్వారా మంచి మార్కులతో శతశాతం ఉత్తీర్ణత సాధిస్తారన్నారు. పరీక్ష రాయడానికి విద్యార్థులు ఆందోళన చెందకుండా తగిన సూచనలు, సలహాలు అందివ్వాలన్నారు. ఈ సందర్భంగా నమూనా పరీక్షలు రాసి మంచి మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు.

పోస్టల్ సేవింగ్ బ్యాంకు పథకాలపై ప్రచారం


పాసు పుస్తకాలు అందిస్తున్న రాములు

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు చేపలుప్పాడలో పోస్టల్ సేవింగ్ బ్యాంకు పథకాలపై మత్స్యకారులకు గురువారం అవగాహన కలిగించారు. విశాఖ రీజియన్ పోస్టుమాస్టర్ జనరల్ రాములు, డివిజన్ సూపరింటెండెంట్ రాహుల్ మాట్లాడుతూ సేవింగ్ బ్యాంకు, ఆర్డీ, ఎస్ఎస్ఏ, టైమ్ డిపాజిట్, పీపీఎఫ్ పథకాల ప్రయోజనాలను వివరించారు. నార్త్ సబ్ డివిజన్ ఐపీవో ఎస్.ప్రభుదాస్, భీమిలి సబ్ పోస్ట్‌మాస్టర్ ఎస్.ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

టోకెన్ ఉన్న వారికే టిడ్కో డీడీలు


టోకెన్ కోసం క్యూలో లబ్ధిదారులు

మధురవాడ: టిడ్కో హౌసింగ్ స్కీమ్ కోసం డబ్బులు కట్టిన వారు జీవీఎంసీ నుంచి డీడీలు వెనక్కి తీసుకోవడం కోసం టోకెన్లలో కేటాయించిన తేదీన మాత్రమే మధురవాడ జోనల్ కార్యాలయానికి రావాలని యూసీడీ ఏపీడీ గంగాధర్ చెప్పారు. జగనన్న కాలనీల్లో స్థలం వచ్చిన వారు, పథకంలో అనర్హులుగా తేలిన వారు లేదా ఇందులో కొనసాగడం ఇష్టం లేని వారు జోన్‌లో సుమారు 6 వేల మంది ఉన్నారని గంగాధర్ చెప్పారు. వారికి కొద్ది రోజులుగా జోనల్ కార్యాలయంలో డీడీలు వెనక్కి ఇస్తున్నామన్నారు. అయితే ఇక్కడకు అంతా ఒకేసారి వచ్చి ఇబ్బందులు పడకుండా 3 రోజులకు ఒకసారి టోకెన్లు ఇస్తున్నామని, వారి టోకెన్‌లో పేర్కొన్న తేదీన మాత్రమే వచ్చి డీడీలు తీసుకోవాలని సూచించారు.

ఇన్‌చార్జి సర్పంచ్‌గా అప్పన్న


ఇన్‌చార్జి సర్పంచ్ బమ్మిడి అప్పన్నతో లక్ష్మీపురం పంచాయతీ పాలకవర్గ సభ్యులు

తగరపువలస: భీమిలి మండలం లక్ష్మీపురం పంచాయతీ ఇన్‌చార్జి సర్పంచ్‌గా ఉప సర్పంచ్ బమ్మిడి అప్పన్నకు పాలకవర్గం బాధ్యతలు అప్పగించింది. ఇటీవల సర్పంచ్ లచ్చుభుక్త రామారావు మృతి చెందడంతో ఖాళీ అయిన స్థానానికి త్వరలో ఎన్నిక జరగనుంది. ఈ నేపథ్యంలో గురువారం జరిగిన పాలకవర్గ సమావేశంలో ఏకగ్రీవంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు తదితరులు అప్పన్నను అభినందించారు.

క్లుప్తంగా

అధినేతకు ఆత్మీయ స్వాగతం


గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు విశాఖ విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మాజీ మంత్రి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు విమానాశ్రయంలో గురువారం కలిసి స్వాగతం పలికారు.

లింగ నిర్ధారణ పరీక్షలు నేరం

ఆనందపురం : లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం నేరమని రాష్ట్రీయ బాల స్వస్థయ కార్యక్రమం కో – ఆర్డినేటర్ ఎస్‌వీ సమత అన్నారు. మండలంలోని నేల్తేరులో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో ఆడపిల్లలు చదువుకోవాలి – ఆడపిల్లలు ఎదగాలి, లింగ నిర్ధారణ అంశాలపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సమత మాట్లాడుతూ గర్భిణులకు ముందుగానే స్కానింగ్ చేసి కడుపులో ఉన్నది ఆడ, మగ అని లింగ నిర్ధారణ చేయడం చట్ట ప్రకారం నేరమని, అలాంటి వారికి జైలు శిక్ష విధిస్తారని చెప్పారు. ఆడపిల్లలను చక్కగా చదివించి మగవారితో సమానంగా అన్ని రంగాల్లో ప్రోత్సహించాలని సూచించారు. వారి భవిష్యత్‌కు భరోసా కల్పిస్తూ అందరూ చేయూత అందించాలని కోరారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి శైలజ, హీనా తివారీ, విద్యాలయం ప్రత్యేకాధికారి చంద్రకళ, బేగం, అరుణ, దేవి తదితరులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ


స్టడీ మెటీరియల్ అందిస్తున్న అప్పారావు

పద్మనాభం: మండలంలోని ఆర్‌వీ పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం తల్లిదండ్రుల కమిటీ కో – ఆప్షన్ మెంబర్ మరగడ అప్పారావు తన సొంత నిధులు రూ.25 వేలతో 83 మంది పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని మంచి మార్కులు సాధించాలని సూచించారు. హెచ్ఎం ఐ.వి.రామిరెడ్డి పాల్గొన్నారు.

ఎండాడ విద్యార్థుల ప్రతిభ


పతకాలు సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

కొమ్మాది: నెల్లూరు జిల్లా ఆత్మకూరులో జరిగిన 66వ స్కూల్ గేమ్స్ రాష్ట్ర స్థాయి పోటీల్లో ఎండాడలోని జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. 9వ తరగతి చదువుతున్న జశ్వంత్, ఎస్.రాజేష్ అండర్ 14 కేటగిరీలో నెట్‌బాల్ పోటీల్లో పాల్గొని రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం కైవసం చేసుకున్నారు. త్వరలో నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో ఈ విద్యార్థులు పాల్గొంటారని వ్యాయామ ఉపాధ్యాయుడు నారాయణరావు తెలిపారు.

టీఎఫ్‌సీలో అగ్నిప్రమాదం

తగరపువలస: స్థానిక భీమిలి రోడ్డులోని టీఎఫ్‌సీ (ఫుడ్‌కోర్ట్)లో షార్ట్ సర్క్యూట్ కారణంగా గురువారం ఉదయం అగ్నిప్రమాదం జరిగి రూ.4 లక్షల విలువైన విద్యుత్ ఉపకరణాలు కాలిపోయాయి. ఉదయం మంటలు చెలరేగిన తర్వాత షట్టర్ నుంచి పొగలు రావడంతో గమనించిన స్థానికులు తాళ్లవలస అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు వచ్చి మంటలు అదుపు చేసిన తర్వాత చూస్తే ఒక ఏసీ యంత్రం, రెండు ఫ్రిడ్జ్‌లు, రెండు టీవీలు, ఒక వన్ గ్రామ్ జ్యూయలరీ తయారీ యూనిట్ కాలిపోయినట్టు గుర్తించారు. బాధితుడు అచ్యుతరావు నుంచి అగ్నిమాపక సిబ్బంది సమాచారం సేకరించారు.

పరిశోధనలతో రక్షణ రంగం పటిష్టం


ఎలెక్ట్రా జాతీయ సదస్సులో ఎన్ఎస్‌టీఎల్ సీనియర్ శాస్త్రవేత్త గణేష్‌కుమార్ తదితరులు

తగరపువలస: డీఆర్‌డీఏ అనుబంధ సంస్థలైన ఎన్ఎస్‌టీఎల్, బీడీఎల్, డీఎల్ఆర్ఎల్, ఇస్రో వంటి ప్రభుత్వరంగ పరిశోధన సంస్థల్లో విద్యార్థులు చేరి నైపుణ్యాలు పెంపొందించుకోవాలని, తద్వారా పరిశోధనలు చేసి రక్షణరంగం పటిష్టతకు కృషి చేయాలని ఎన్ఎస్‌టీఎల్ సీనియర్ శాస్త్రవేత్త గణేష్ కుమార్ కోరారు. సంగివలస అనిట్స్‌లో ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో ఎలెక్ట్రా – 2023 జాతీయ స్థాయి సాంకేతిక సమ్మేళనం గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ వ్యవస్థలో విప్లవాత్మక మార్పుల వల్ల 5జీ సమాచార ప్రసారాలు, అంతర్జాల వ్యవస్థ గ్రామీణవాసులకు అందుబాటులోకి వచ్చాయన్నారు. వీఎల్ఎస్ఐ, అంబిడెడ్ మైక్రోవేవ్ ఇంజినీరింగ్ రంగాల పరిశోధనల్లో అవకాశాలను వివరించారు. ఈసీఈ విభాగాధిపతి బండి జగదీష్ మాట్లాడుతూ సమ్మేళనం ఉద్దేశాలను వివరించారు. ప్రిన్సిపాల్ కాల్వ శ్రీరామకృష్ణ మాట్లాడుతూ పరిశోధనల కారణంగా సామాన్య ప్రజలకు సాంకేతిక ఫలాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. సదస్సులో అకడమిక్ హెడ్ రాజ్యలక్ష్మి, ప్లేస్‌మెంట్ డీన్ మన్మథరావు పాల్గొన్నారు.

దేశ ప్రగతిలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తల పాత్ర కీలకం

కొమ్మాది: దేశ ప్రగతిలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తల పాత్ర కీలకమని, రానున్న దశాబ్దిలో దేశంలో యువతకు ఉద్యోగ అవకాశాలు పూర్తి స్థాయిలో లభించాలంటే ఏటా స్టార్టప్ కంపెనీల సంఖ్య గణనీయంగా పెరగాల్సిన ఆవశ్యకత ఉందని సెయింట్ చైర్మన్ బి.వి.మోహన్‌రావు అన్నారు. గీతం వర్సిటీలో గురువారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం పరిశ్రమల స్థాపనకు రెండు మూడు రోజుల్లో అనుమతులు లభిస్తున్నాయన్నారు. గీతం అధ్యక్షుడు ఎం.శ్రీభరత్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలు అదృశ్యం


వానపల్లి జయలక్ష్మి

తగరపువలస: స్థానిక రాజవీధికి చెందిన 75 ఏళ్ల వృద్ధురాలు వానపల్లి జయలక్ష్మి నగరంలోని 104 ఏరియాలో నివసిస్తున్న మూడో కుమారుడు నాగేశ్వరరావు వద్దకు గురువారం వెళ్తూ అదృశ్యమయింది. ఆమె ఆచూకీ తెలిస్తే 78935 60931, 99668 38395కు సమాచారం అందించాలని కుటుంబ సభ్యులు కోరారు.

ఫంక్షన్ హాల్‌లో ఫ్యాన్లు చోరీ

తగరపువలస: భీమిలి రోడ్డులోని చిల్లపేట చెరువు వద్ద తిరుమల ఫంక్షన్ హాలులో గత నెల 25న 5 వాల్ ఫ్యాన్లు, 4 స్టాండ్ ఫ్యాన్లు చోరీ చేశారు. ఫంక్షన్ హాలు అధినేత ఎరుసు రవిశంకరరెడ్డి గత నెల 28న ఫంక్షన్‌హాలు తెరిచి చూడగా వెనుక నుంచి ప్రవేశించిన దొంగలు ఫ్యాన్లు చోరీ చేసినట్టు గుర్తించారు. సీసీ కెమెరాలను పరిశీలించగా గుర్తు తెలియని వ్యక్తులు 25న ఫ్యాన్లు పట్టుకుపోయినట్టు నమోదయింది. భీమిలి క్రైం హెడ్ కానిస్టేబుల్ వి.వరలక్ష్మి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గాలికుంటు వ్యాధిపై అప్రమత్తత అవసరం

ఆనందపురం : పాడి పశువులపై తీవ్ర ప్రభావం చూపే గాలికుంటు వ్యాధి పట్ల రైతులు అప్రమత్తంగా ఉండి వెంటనే చికిత్స చేయించాలని పశు వైద్యాధికారి లీలారాణి సూచించారు. మండలంలోని వెల్లంకి, లొడగలవానిపాలెం, కౌంత్యాం గ్రామాల్లో గురువారం సుమారు 500 ఆవులు, గేదెలకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి బారిన పడిన ఆవులు, గేదెలు తీవ్ర అనారోగ్యానికి గురై పాల దిగుబడి తగ్గిపోతుందన్నారు. పునరుత్పత్తి సామర్థ్యాన్ని కోల్పోతాయన్నారు. ఈ నెల 31 వరకు టీకాలు వేస్తామని చెప్పారు. కౌంత్యాం పశు ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎల్.కన్నంనాయుడు, లైవ్‌స్టాక్ అసిస్టెంట్ డి.తేజ తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభం: గాలి కుంటు వ్యాధి పట్ల పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని పాండ్రంగి పశు వైద్యాధికారిణి ఆర్.అనుపమ సూచించారు. పాండ్రంగి పంచాయతీ ఏనుగులపాలెం, కొవ్వాడలో వంద పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణకు గురువారం టీకాలు వేశారు. ఈ సందర్భంగా అనుపమ మాట్లాడుతూ నాలుగు నెలల వయసు దాటిన ఆవులు, పశువులకు గాలి కుంటు వ్యాధి సోకుతుందన్నారు. వీఎల్‌వో ఎస్.దేశి, వీఏ రమణ పాల్గొన్నారు.

240 పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

తగరపువలస: తాళ్లవలస, దాకమర్రి పశు ఆస్పత్రుల వైద్యులు దినేష్‌కుమార్, ఆర్.శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం గాలికుంటు వ్యాధి నివారణకు 240 పశువులకు టీకాలు వేశారు. తాళ్లవలస ఆస్పత్రి పరిధిలో 150, దాకమర్రి పరిధిలో 90 పశువులకు టీకాలు వేశారు. వీఏలు ఆశపు సరస్వతి, మేరీ, వెటర్నరీ సిబ్బంది కె.రవి, యజ్ఞేష్, శివ, గోపాలమిత్ర చిన్నారావు పాల్గొన్నారు.

సుధాకర్‌ను గెలిపించుకునే బాధ్యత అందరిదీ


భీమిలిలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు


పీఎం పాలెంలో యువకులతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి

భీమునిపట్నం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరచిన సీతంరాజు సుధాకర్‌ను గెలిపించుకునే బాధ్యత మనందరిపైనా ఉందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. సుధాకర్‌కు ఓట్లు వేయాలని కోరుతూ గురువారం ప్రభుత్వ ఆస్పత్రి, మహిళ పాలిటెక్నిక్ కళాశాల, బాలికల గురుకుల పాఠశాలలో సిబ్బందిని కలిసి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖపట్నం పరిపాలనా రాజధానిగా మారుతున్న క్రమంలో ఉత్తరాంధ్ర అభివృద్ధికి సుధాకర్ గెలుపు ఎంతో కీలకమన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ ప్రాంతం ఇప్పటికే ఎంతగానో అభివృద్ధి చెందిందన్నారు.

ఆనందపురం : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి వైఎస్సార్ సీపీ బలపరిచిన సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతూ నాయకులు గురువారం ప్రచారం చేశారు. మండలంలోని మామిడిలోవ, గండిగుండం, కణమాం, భీమన్నదొరపాలెం, కోలవానిపాలెం, రామవరం, తర్లువాడలో ఓటర్లను కలిసి కరపత్రాలు అందించారు. పార్టీ మండల అధ్యక్షుడు బంక సత్యం, కాకర్లపూడి శ్రీకాంత్‌రాజు, పాండ్రింకి శ్రీను, బొట్టా రామకృష్ణ, గంగ్రెడ్డి శ్రీనువాస్, పాండ్రింకి అప్పారావు, బీఆర్‌బీ నాయుడు, బలిరెడ్డి మహేష్, రౌతు వెంకటరావు, లెంక రాంబాబు, లొడగల రమణ, కోరాడ వెంకట రమణారావు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల కార్యాలయం పరిశీలన

పీఎం పాలెం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ వైఎస్సార్ సీపీ అభ్యర్థి సుధాకర్ స్థానిక కార్యాలయాన్ని టీటీడీ చైర్మన్, పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి గురువారం సందర్శించారు. కార్యాలయ నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ మద్దతుతో పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించడానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆయనవెంట పెందుర్తి ఎమ్మెల్యే అదీప్ రాజు, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ ఉన్నారు.


మాలతాంబ స్కూలు సిబ్బందితో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

పీఎం పాలెం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీగా వైఎస్సార్ సీపీ మద్దతుతో పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్ గెలుపే లక్ష్యంగా ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పీఎం పాలెంలో గురువారం ఎన్నికల ప్రచారం చేశారు. స్థానిక మాలతాంబ స్కూలులో పని చేస్తున్న ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మద్దతుతో ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్ సమర్థుడని వివరించారు. మాలతాంబ విద్యాసంస్థల అధినేత సునీల్ మహంతి, పార్టీ 6వ వార్డు అధ్యక్షుడు బొట్ట అప్పలరాజు, కె.వరలక్ష్మి, ఈఎస్ఎస్ చంద్రరావు, సియ్యాద్రి కనకరాజు, పోతిన ప్రసాద్, జామి శివకుమార్ పాల్గొన్నారు.

తగరపువలస: వైఎస్సార్‌సీపీ బలపరచిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు గురువారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. తాళ్లవలస, రేఖవానిపాలెం, మూలకుద్దు, టి.నగరపాలెం, తాటితూరు పంచాయతీల్లో నిర్వహించిన ప్రచారంలో వ్యవసాయశాఖ జిల్లా సలహా మండలి చైర్మన్ దాట్ల ప్రసాదరాజు, భీమిలి ఏఎంసీ చైర్మన్ ఎలమంచిలి సూర్యనారాయణ, ఎంపీపీ దంతులూరి వాసురాజు, జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు గాడు శ్రీను, సర్పంచ్‌లు పొట్నూరు ఛాయాగౌతమి, సమ్మిడి శ్రీనివాసరావు, కొల్లి కోటిరెడ్డి, శిరిగుడి సంతోషి, బోని జగ్గమ్మ, జీవీ నారాయణ, ఎంపీటీసీ ప్రతినిధులు పల్లా నీలిమ, ఉండబట్ల ఆదిలక్ష్మి, నాయకులు దుంపల నాగమణి, చిల్ల హరి, అక్కరమాని అప్పలనాయుడు, పొట్నూరు చంద్రశేఖర్, దంతులూరి వేణు పాల్గొన్నారు. జీవీఎంసీ ఒకటో వార్డు బంగ్లామెట్టపై కో ఆప్షన్ సభ్యురాలు కొప్పల ప్రభావతి, పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు, వార్డు అధ్యక్షుడు జగుపల్లి ప్రసాద్, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మిన రామలక్ష్మణ, చింతగుంట శివ, కుంచా శివరామకృష్ణ పాల్గొన్నారు.

సిబ్బంది సమయపాలన పాటించాలి


వైద్యులతో డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట : వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది సమయపాలన పాటించాలని, ఎఫ్ఆర్ఎస్ హాజరు, బయోమెట్రిక్ వేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆదేశించారు. పీఎం పాలెంలోని పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఆస్పత్రిలో రిజస్టర్లు తనిఖీ చేశారు. మందుల నిల్వను పరిశీలించారు. గర్భిణులకు ప్రయాణ సదుపాయం కల్పించాలని, ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. వైద్యులు శశిభూషణ్, బి.నాగభూషణం, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల ప్రచారం

మధురవాడ: జీవీఎంసీ 5వ వార్డు నగరంపాలెంలో టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి వి.చిరంజీవి విజయాన్ని కాంక్షిస్తూ పార్టీ నాయకులు గురువారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. భీమిలి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కోరాడ రాజబాబు, తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత


ప్లకార్డులు ప్రదర్శిస్తున్న జీవీఎంసీ స్కూల్ విద్యార్థులు

ఎంవీపీ కాలనీ: ప్రకృతి ధర్మమైన గొలుసు కట్టు విధానంలో మనిషి, భూగోళం మనుగడకు వన్యప్రాణుల సంరక్షణ అత్యంత అవసరమని గ్రీన్ క్లైమేట్ సంస్థ వ్యవస్థాపకుడు జేవీ రత్నం అన్నారు. మార్చి 3న 50వ వన్యప్రాణి దినోత్సవ నినాదాన్ని విజయవంతం చేయాలని కోరుతూ సంస్థ ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీలోని సెవెంత్ డే ఎడ్వంటరిస్ట్ స్కూల్, ఏఎస్ రాజా మహిళల జూనియర్ కళాశాల, శివాజీపాలెం జీవీఎంసీ ప్రైమరీ పాఠశాలల్లో గురువారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జేవీ రత్నం మాట్లాడుతూ ఐక్యరాజ్య సమితి విడుదల చేసిన 'వన్యప్రాణుల సంరక్షణ కోసం భాగస్వాములు కండి' నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. భూమి మీద ఉన్న వన్యప్రాణులు, మొక్కలు భూమి మనుగడకు, మనిషి ఆరోగ్య పరిరక్షణకు ఎలా కారణమవుతున్నాయో ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏయూ సోషల్ వర్క్ విద్యార్థిని మెడగాస్కర్, ఏఎస్ రాజా కళాశాల ప్రిన్సిపాల్ సాంబశివరావు, శివాజీపాలెం జీవీఎంసీ స్కూల్ హెచ్ఎం బీకేడీ కుమారి తదితరులు పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో విద్యార్థులు పాల్గొని వన్యప్రాణి సంరక్షణపై ప్లకార్డులు ప్రదర్శించి, నినాదాలు చేశారు.